క్లుప్తంగా

రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి

సంగారెడ్డి టౌన్ : రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రూన్సీ సూచించారు. సంగారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రైతు కార్డు నమోదు అనేది రైతులందరికీ ముఖ్యమైనదని దీని ద్వారా ప్రభుత్వ పథకాలు, రాయితీలను పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని పూర్తి వివరాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. ధైర్యంగా ఉండండి

మునిపల్లి(అందోల్): అండగా ఉంటాం ధైర్యంగా ఉండాలని రాజనర్సింహ్మ ఫౌండేషన్ చైర్మన్ శిలాపూర్ త్రిష మణికంఠ బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు. బుధవారం సంగారెడ్డిలో మంత్రి దామోదర క్యాంపు కార్యాలయంలో మండలంలోని పెద్దచల్మెడ గ్రామానికి చెందిన చాకలి దుర్గయ్య, కంకోల్ గ్రామానికి చెందిన రషీద్ కుతూరు పెళ్లికి రాజనర్సింహ్మ పౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కంకోల్ గ్రామానికి చెందిన ఎండీ రషీద్ నాలుగేళ్ల క్రితం పాము కాటుతో మృతి చెందాడు. దీంతో రషీద్ కూతురు వివాహానికి ఆర్థిక సహాయం అందజేశారు. పెద్దచల్మెడ గ్రామానికి చెందిన చాకలి దుర్గయ్య యాక్సిడెంట్‌లో మృతి చెందాడు. వారికి కూడా రాజనర్సింహ్మ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు.

కార్మిక సంఘం ఎన్నికల్లో ఇండిపెండెంట్ గెలుపు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ సమీపంలోని ముంగి ఇంజనీరింగ్ పరిశ్రమలో బుధవారం జరిగిన కార్మిక సంఘం ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి గోవర్ధన్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బీఎంఎస్ అభ్యర్థిగా మల్లేశం, స్వతంత్ర అభ్యర్థిగా గోవర్ధన్‌లు పోటీ చేశారు. 63 ఓట్లు పోల్ అవ్వగా గోవర్ధన్‌కు 47, మల్లేశంకు 15 ఓట్లు పడ్డాయి. 32 ఓట్ల మెజారీతో విజయం సాధించారు. దీంతో ఆయన మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు.

ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

రాయికోడ్(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగేలా చూడాలని ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని హస్నాబాద్, సంగాపూర్ గ్రామాలను సందర్శించారు. జాతీయ ఉపాధిహామీ పనులను, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి 414 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 145 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయన్నారు. 17 మంది లబ్ధిదారులకు మొదటి విడతలో భాగంగా రూ.లక్ష బిల్లు చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

తహసీల్దార్‌గా చంద్రశేఖర్ బాధ్యతల స్వీకరణ

వట్‌పల్లి(అందోల్): వట్‌పల్లి మండల తహసీల్దార్‌గా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎం. శ్రీనివాస్ జీహెచ్ఎంసీ ఎలక్షన్ బ్రాంచికి బదిలీ అయ్యారు. ఇక్కడే డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న చంద్రశేఖర్‌కు తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించారు. అనంతరం విధుల్లో చేరిన చంద్రశేఖర్‌ను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌ను సన్మానించి వీడ్కోలు పలికారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కాలనీలను మున్సిపల్ కమిషనర్ దశరథ్ బుధవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న డిజిటల్ బోధన పద్ధతులను పర్యవేక్షించారు. కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అమీన్‌పూర్ (పటాన్‌చెరు): కాలనీ ఫేజ్ 1లోని హ్యాపీ ఫెదర్స్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 2023–2025 కాల పరిమితిని పూర్తి చేసుకున్న పాత కార్యవర్గానికి అభినందనలు తెలుపుతూ 2025–2027 కాలానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అజయ్ ఒరుగంటి, ఉపాధ్యక్షుడు శేఖర్ రెడ్డి జక్కిరెడ్డి, సాధారణ కార్యదర్శి శివ కృష్ణ రాంధి, సహాయ కార్యదర్శి , సందీప్ చింతల, ఖజానాదారు వంశీ మోరిశెట్టి, కార్యవర్గ సభ్యులు వెంకట్ రాంరెడ్డి బుషిరెడ్డి, శ్రీకాంత్ బయర్గోని, మురళీ కృష్ణ లింగంపల్లి, నాగేశ్వర్‌రావు సానబోయిన, సర్కార్ శ్రీనివాసులు చొక్కారి, వీరా రెడ్డి కొండేటిలను ఎన్నుకున్నారు.

రైతు వేదికల్లో సాగు చైతన్యం

- రైతులకు సలహాలు, సూచనలిస్తున్న ఏఈఓలు
- జిల్లాలో 116 రైతు వేదికలు
- 28 మంది ఏఓలు
- 116 మంది ఏఈఓలు



కంకోల్ రైతు వేదికలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతు వేదికలు అన్నదాతకు అండగా నిలబడుతున్నాయి. రైతు వేదికల ద్వారా రైతులకు పలు రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. ఏఈఓల ద్వారా వివిధ రకాల పంటల సాగులో అన్నదాతలను ఎప్పటికప్పుడు చైతన్యం చేస్తూ సలహాలు, సూచనలిస్తూ మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. అలాగే రైతులందరినీ ఒకే చోట చేర్చి వారికి పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు ఈ రైతు వేదికలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. జిల్లాలో 28 మండలాల్లో మొత్తం 116 రైతు వేదికలున్నాయి. 28 మంది మండల (ఏఓలు) వ్యవసాయాధికారులతోపాటు 116 మంది వ్యవసాయ విస్తీర్ణాధికారులు (ఏఈఓలు)లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

రైతు వేదికలతో ఇవీ ప్రయోజనాలు...

జిల్లాలో నిర్మించిన రైతు వేదికలతో రైతులకు పలు రకాల ప్రయోజనాలు కలుగుతున్నాయి.

- ప్రతి క్లస్టర్ పరిధిలోని రైతు వేదికలో ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలిస్తున్నారు.
- రైతు వేదికల్లో ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేసి పంట సాగుపై అవగాహన కల్పిస్తున్నారు.
- పంటలకు తెగుళ్ల సోకినప్పుడు క్లస్టర్ పరిధిలోని ఏఈఓలు పంటలను నేరుగా సందర్శించి వాటి నివారణకు సూచనలు చేస్తున్నారు.
- రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలపై అవగాహన కల్పిస్తున్నారు.
- పంటలకు తెగుళ్ల సోకినప్పుడు గతంలో రైతులు ఇష్టం వచ్చిన మందులు పిచికారీ చేసేవారు. దీంతో తెగుళ్ల తగ్గకపోగా రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు. కానీ, రైతు వేదికలు వచ్చిన తర్వాత పంటలకు ఏ తెగులు సోకింది? దాని నివారణకు ఏ మందులు వాడాలో ఏఓలు, ఏఈఓలు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నారు



క్లస్టర్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు రైతు వేదికలో ఏఓ, ఏఈఓలు రైతులకు పంటల సాగుపై, తెగుళ్ల వచ్చినప్పుడు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. పంటలకు ఎరువులు ఏ మోతాదులో వేయాలనే వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు.

ఇందూర్ మోహన్, రైతు

అందుబాటులో వ్యవసాయాధికారులు



సంగారెడ్డి జిల్లాలోని అన్ని క్లస్టర్ల పరిధిలో ఏఓలు, ఏఈఓలు రైతులకు ప్రతీ రోజు అందుబాటులోనే ఉంటున్నారు. ఆయా గ్రామాల రైతులకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తూ పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతు భరోసా మంజూరు కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకున్నాం. – శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకోరేం?

పలువురు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల ఆవేదన



తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకుని అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా తమను పట్టించుకోవడం లేదని తెల్లాపూర్ మున్సిపల్ వాసులు ఆవేదన చెందుతున్నారు. మున్సిపల్ పరిధిలో రెండు నెలల క్రితం వందలాది మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎల్ఆర్ఎస్ రుసుము కూడా చెల్లించేశారు. అయితే అధికారులు తమను మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటూ పని మాత్రం చేయడం లేదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. తమ దరఖాస్తు విషయాన్ని ఏమైందని అడిగితే అస్సలు సమాధానం చెప్పకపోగా తమ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు. కొందరికి మాత్రం అధికారులు ఆగమేఘాలపై పనిపూర్తి చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. మరి కొంతమంది ఇప్పటివరకు అధికారులు చేసిన ఎల్ఆర్ఎస్‌లపై విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నా దృష్టికి రాలేదు

మున్సిపల్ కార్యాలయంకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నాం. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్న విషయం ఎవరు నాదృష్టికి తీసుకురాలేదు. ఇక ముందు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం.

– అజయ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

మునిపల్లి(అందోల్): చికిత్స పొందుతూ ఇద్దరు యువకులు మృతి చెందారు. బుధవారం ఎస్ఐ రాజేశ్ నాయక్ కథనం ప్రకారం.. మునిపల్లికి చెందిన రాజు (33), పత్తి మందు తాగి, తాటిపల్లి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ (19) గడ్డి మందు తాగి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మునిపల్లికి చెందిన రాజు మద్యానికి బానిసయ్యాడు. కడుపులో మంటగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చూపించగా లివర్ పాడైందని వైద్యులు తెలిపారు. మద్యం తాగితే ప్రాణానికే ప్రమాదమని డాక్టర్లు రాజును హెచ్చరించారు. ఈ నెల 8న పత్తి మందు తాగి మృతి చెందారు. తాటిపల్లి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ ఈ నెల 7న నేను మందు తాగి చనిపోతానని తన వ్యవసాయ పొలం నుంచి కుటుంబ సభ్యులు, స్నేహితులకు రాజు వీడియో కాల్ చేశాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు వెళ్లేలోగా పొలంలో గడ్డి మందు తాగాడు. సదాశివపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 9న రాజు మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్‌నాయక్ పేర్కొన్నారు.

బరువు, ఎత్తులో నిర్లక్ష్యం వద్దు

నారాయణఖేడ్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ఆరేళ్లలోపు చిన్నారుల బరువు, ఎత్తు విషయంలో నిర్లక్ష్యం వహించకుండా కచ్చితత్వంతో నమోదు చేయాలని మహిళా స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లలితకుమారి సూచించారు. ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను మూడు రోజులపాటు జిల్లాలోని సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చిన్నారుల బరువు, ఎత్తు తూకం తదితర అంశాలను పర్యవేక్షించారు. అనంతరం ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో ఖేడ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మాట్లాడారు. పిల్లల బరువు, ఎత్తు నమోదులో చిన్ని చిన్ని లోపాలు కనిపించాయని, వాటిని సరిచేసుకోవాలని సూచించారు. పౌష్టికాహారం అందజేస్తూ చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సీడీపీఓ సుజాత పాల్గొన్నారు.

ముళ్ల పొదల తొలగింపు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం బుధవారం కొనసాగింది. పట్టణంలోని మంగల్‌పేట్‌లో నిజాంపేట– ఖేడ్– బీదర్ 161బీ జాతీయ రహదారి పక్కన దట్టంగా పెరిగిన పొదల తొలగింపు పనులు చేపట్టారు. చెత్తతో విషకీటకాలు సంచరించే అవకాశం ఉండటంతో జేసీబీతో తొలగించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వెంకటశివయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, అధికారులు పర్యవేక్షించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సీఎం సహాయనిధి ఆపత్కాలంలో అండగా నిలిచి ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కలిస్తూ ఆదుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. సుమారు రూ. వెయ్యి కోట్లకుపైగా నిధులను సీఎంఆర్ఎఫ్ కోసం వెచ్చించిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మండలంలోని దోపూరుకు చెందిన బస్లంగొండకు రూ.60 వేలు, కంగ్టి మండలం ఘన్‌పూర్‌కు చెందిన సావిత్రికి రూ.16,500 చెక్కులు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరయ్యాయి. బుధవారం ఈ చెక్కులను ఖేడ్‌లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి లబ్ధిదారుల కుటుంబీకులకు అందజేశారు. మనూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకాష్‌రావు, నాయకులు రాములు, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ తహసీల్దార్‌కు వినతి

మునిపల్లి(అందోల్): దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా సీఐటీయూ నాయకులు తహసీల్దార్ గంగాభవానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రమేశ్‌గౌడ్, వివిధ సంఘాల నాయకులు నాగేశ్ కుమార్, నర్సింలు, విఠల్ గౌడ్ పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు బస్సు సౌకర్యం

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ కళాశాలలో చదివే ఆయా గ్రామాల విద్యార్థులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రవాణా సౌకర్యం కల్పించారు. మండలంలోని ఊట్ల, దాదిగూడెం, రామ్‌నగర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. ప్రతిరోజు ఆయా గ్రామాల నుంచి కళాశాలకు వచ్చేందుకు ఎలాంటి రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన న్యూలాండ్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటే చేశారు.

◆ మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలి

పటాన్‌చెరు: సిగాచి పరిశ్రమ ప్రమాదంలో మృతిచెందిన కార్మిక కుటుంబాలకు రూ. కోటి నష్టపరిహారం వెంటనే ఇవ్వాలని, ఇప్పటివరకు ఆచూకీ దొరకని ఎనిమిది మంది కార్మికుల కుటుంబాలు రూ. 15 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుంటే ఊరుకునేది లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మానిక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం పటాన్‌చెరులో ఆయన మాట్లాడుతూ.. సిగాచీ పరిశ్రమలో ఇప్పటివరకు 44 మంది మృతి చెందారని, ప్రమాదం జరిగి నేటికీ పది రోజులైన మరో 8 మంది కార్మికుల ఆచూకీ కని పెట్టకపోవడం దారుణం అన్నారు. ఉన్నతస్థాయి కమిటీ, నిపుణుల కమిటీ విచారణ జరిగినప్పటికీ నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ప్రమాద ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

◆ ఇందిరా మహిళ శక్తి సంబరాలు

సదాశివపేట(సంగారెడ్డి): మండల పరిధిలోని చందాపూర్, పెద్దాపూర్ గ్రామాల్లోని మహిళా సంఘాల్లోని సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సాంస్కృతిక సారథి కళాకారుల బృందం ఆటపాటలతో అవగాహన కల్పించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రత్యేకంగా మహిళలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు స్వశక్తితో మహిళ ఎదుగుదలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరిస్తూ కళా ప్రదర్శనలు ఇచ్చారు. మహిళలను కోటీశ్వరులను చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆశయాన్ని పాటల రూపంలో వివరించారు. సాంస్కృతిక సారథి కళాకారుల బృందం లీడర్ సునీల్, దుర్గేశ్, మల్లేశ్, వినేశ్, పటేల్ సంధ్య, గొని శంకర్ భామిని నవీన్‌కుమార్ సదాశివపేట ఏపీఎం నర్సింహులు, సీసీ రవి మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

◆ నేడు గురు పౌర్ణమి మహోత్సవాలు

నారాయణఖేడ్: శ్రీషిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో నేడు వ్యాస గురు పౌర్ణమిని పురస్కరించుకుని మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కొండాపూర్ శివారు తండాలోని దక్షిణ కాళికామాత ఆలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ పీఠాధిపతి జగదీశ్వరానంద్ మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ, అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవం

నారాయణఖేడ్: ఏబీవీపీ ఖేడ్ శాఖ ఆధ్వర్యంలో 77వ ఏబీవీపీ ఆవిర్భావ దినత్సోవాన్ని పురస్కరించుకొని జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండావిష్కరణ నిర్వహించి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. నగర కార్యదర్శి శంకర్ మాట్లాడుతూజ.. ఏబీవీపీ 9 జూలై 1949లో ఐదుగురు సభ్యులతో ప్రారంభమై నేడు లక్షలాదిమంది విద్యార్థులను భాగస్వాములను చేసి అతిపెద్ద స్టూడెంట్ యూనియన్‌గా ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మికులు



నారాయణఖేడ్: రాజీవ్‌చౌక్‌లో ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాలు, కార్మికులు



జిన్నారం(పటాన్‌చెరు): బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



రామచంద్రాపురంలో సీఐటీయూ నాయకుల ర్యాలీ

గుమ్మడిదల రైతులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న గుమ్మడిదల రైతులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 109 భూ బాధితులు బుధవారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డితో కలిసి సమస్యను వివరించారు. పరిశ్రమల ఏర్పాటుకు భూములు కోల్పోతున్న రైతులు తగిన పరిహారం అందించేందుకు కృషి చేయాలని ఆయనను కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించి న్యాయపరమైన పరిహారం అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, మద్దుల బాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సత్యనారాయణ, వాసుదేవరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు రాయితీ

రైతులతో కలెక్టర్ ప్రావీణ్య



గోవింద్‌పూర్‌లో ఆయిల్‌పామ్ మొక్కను నాటిన కలెక్టర్ ప్రావీణ్య

జహీరాబాద్: పంట మార్పిడిని ప్రోత్సహిస్తూ మూడు రెట్లు అధిక దిగుబడి కలిగించే బహు వార్షిక వాణిజ్య పంట అయిన ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం 90% రాయితీని కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య స్పష్టం చేశారు. మండలంలోని గోవింద్‌పూర్ గ్రామంలోని రైతు నాగిశెట్టి రాథోడ్ వ్యవసాయ పొలంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య పాల్గొని మొక్కలు నాటారు. అంతకుముందు మండలంలోని హోతి(కె) గ్రామ శివారులోని కస్తూర్బా గాంధీ(కేజీబీవీ) మైనార్టీ బాలికల పాఠశాలను సందర్శించి క్లాస్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీతో పాటు మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందిస్తోందన్నారు. మొదటి నాలుగేళ్ల పాటు అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.4,200 ప్రోత్సాహకం కింద అందిస్తుందన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును 3,750 ఎకరాలు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఇప్పటికే జూన్ నెలలో 200 ఎకరాల్లో మొక్కలు నాటడం పూర్తయిందని తెలిపారు. అంతకుముందు క్లాస్ రూమ్‌లను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందరికీ అందాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు నూతన శైలి బోధనా పద్ధతులు పాటించాలని సూచించారు. ముఖ్యంగా గణిత శాస్త్రం, సైన్స్, ఇంగ్లీష్ వంటి సబ్జెక్టుల్లో పిల్లలకు ఆత్మ విశ్వాసం పెంపొందించేలా బోధన జరగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రామ్‌రెడ్డి, తహసీల్దార్ దశరథ్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సోమేశ్వర రావు, మండల అధికారి పండరీ, గోద్రేజ్ సంస్థ ప్రతినిధులు కొండలరావు, వెంకటేశ్వర్లు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిధుల దుర్వియోగంపై నిలదీత



అధికారులను నిలదీస్తున్న గ్రామ ప్రజలు

జహీరాబాద్: మండలంలోని గోవింద్‌పూర్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ప్రజలు అధికారులను నిలదీశారు. బుధవారం గ్రామంలో ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరస్వతీ, ఆయా శాఖల అధికారులు, గ్రామ ప్రజల సమక్షంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పంచాయతీ కార్యాలయం వద్దకు వచ్చి సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన సమయంలో ఎంత మేర నిధులు ఉన్నాయి? పన్నుల రూపంలో, ఇతరత్రా వచ్చిన నిధులు ఎంత మేర వచ్చాయనే దానిపై వివరాలు అడిగారు. నిధులను దుర్వినియోగం చేశారని, చేయని పనులకు రికార్డులు చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని తక్షణమే తేల్చాలని పట్టుబట్టారు. దీంతో గందరగోళం ఏర్పడింది. ఈ విషయమై ఎంపీడీఓ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిధుల దుర్వినియోగం జరగలేదని, వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పనులు, నిధులకు సంబంధించిన లెక్కలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో రూ.కోటి మేర నిధులు ఉండగా వివిధ పనులకు సంబంధించి రూ.50లక్షలు ఖర్చు చేశామని, మిగిలిన నిధులు పంచాయతీ ఖాతాలో ఉన్నట్లు వివరించారు.

ఎల్ఐసీ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

జహీరాబాద్ టౌన్: ఎల్ఐసీ జహీరాబాద్ శాఖ ఉద్యోగులు బుధవారం కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. దేశంలోని ప్రభుత్వ ఉద్యోగులు, కార్మిక హక్కులు కాలరాసే చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ పాలసీదారులు చెల్లిస్తున్న ప్రీమియంపై జీఎస్టీ రద్ద చేయాలని, క్లాస్ 3, 4 ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని, కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎల్ఐసీ ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.